నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గచ్చిబౌలి: విద్యుత్ సంబంధ మరమ్మతు పనుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు కొండాపూర్ ఏఈ రంగారెడ్డి తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జేవీజీహిల్స్, గాయత్రి లేఅవుట్, సెంట్రల్ పార్క్ ఫేజ్-2, 3, కాంతివనం ఓమూ ప్రొఫెసర్స్ కాలనీ, ఖానామెట్ ముస్లిం బస్తీ, మాతాభువనేశ్వరీ కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు.

- మధ్యాహ్నం ఒంటిగంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు మాధవిహిల్స్, గోల్డెన్ తులీప్ రోడ్ నెంబర్ 1, 2, 3, 4, 5, వెంకటరమణ టాటా మోటార్స్ లేన్, రాఘవేంద్ర కాలనీ హైటెన్షన్ లేన్, జేవీజీహిల్స్, శిల్పా వ్యాలీ, సెంట్రల్ పార్క్ ఫేజ్-2, కాంతి వనం తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

వైట్ ఫీల్డ్ పరిధిలో..

ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు మసీద్‌బండ, క్యామ్లెట్ లేఅవుట్, సీఎంసీ లేఅవుట్ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని వైట్‌ఫీల్డ్ ఏఈ కిశోర్ తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలకు నల్లా కనెక్షన్ ఇవ్వండి


డీజీఎం నరేందర్‌రెడ్డికి వినతి పత్రమిస్తున్న జగదీశ్వర్‌గౌడ్

రాయదుర్గం: నానక్‌రాంగూడలోని ప్రభుత్వ పాఠశాలలో కొత్తగా కుళాయి ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ కోరారు. ఈ మేరకు జలమండలి గచ్చిబౌలి డీజీఎం నరేందర్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యుత్ సరఫరా లేక, తీవ్ర నీటి సమస్యను విద్యార్థులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వెంటనే కుళాయి మంజూరు చేయాలని కోరారు. వెంటనే కుళాయి కనెక్షన్ ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామని డీజీఎం హామీ ఇచ్చారని ఆయన వెల్లడించారు. అంతేకాకుండా కుళాయి ద్వారా తాగునీటి సరఫరా అయ్యే వరకు వారానికి రెండు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాను చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరామని తెలిపారు. కాంగ్రెస్ నేతలు సంజీవ రెడ్డి, శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు.

నాలా పనుల పరిశీలన


నాలా పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్

శేరిలింగంపల్లి: నల్లగండ్ల చెరువు నుంచి భెల్ చౌరస్తా వరకు ఓపెన్ నాలా నిర్మాణ పనులను తారానగర్‌లో కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా నాగేందర్‌యాదవ్ మాట్లాడుతూ... ఓపన్ నాలా ఆర్‌సీసీ బెడ్, సైడ్ వాల్స్ నిర్మాణంతో వరద ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. వచ్చే వర్షాకాలం లోపు పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డివిజన్ గౌరవాధ్యక్షుడు వీరేశం గౌడ్ పాల్గొన్నారు.

వాహనం ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

గచ్చిబౌలి: గుర్తు తెలియన వాహనం బైక్‌ను ఢీ కొట్టడంతో ఓ వ్యక్తికి తీవ్రంగా గాయపడిన సంఘటన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... టోలీచౌకీ హకీంపేట్‌కు చెందిన ముస్తాఫా అలీ(40) ఓ ప్రైవేట్ కంపెనీలో సేల్స్‌మెన్‌గా పని చేస్తున్నాడు. గచ్చిబౌలి నుంచి లింగంపల్లి వైపు గురువారం ఉదయం 9.30 గంటల సమయంలో వెళుతుండగా హెచ్‌సీయూ ప్రధాన ద్వారం సమీపంలో గుర్తు తెలియని వాహనం వెనకనుంచి ఢీ కొట్టింది. ఎగిరి కింద పడటంతో ముస్తఫాకు తీవ్ర గాయాలయ్యాయి. అమీర్‌పేట్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఢీ కొట్టిన వాహనం కోసం పోలీసులు సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

‘పది’లో వంద శాతం ఫలితాలే లక్ష్యం

ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులు

- పరీక్షల భయం పోగొడుతున్న టీచర్లు
- నిత్యం స్లిప్ టెస్టులు
- ఇప్పటికే మూడు ప్రాక్టీస్ టెస్ట్‌ల నిర్వహణ
- విద్యార్థులకు సాయంత్రం స్నాక్స్


ఖాజాగూడలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులకు స్నాక్స్ అందిస్తున్న దృశ్యం


శేరిలింగంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవనం

శేరిలింగంపల్లి/రాయదుర్గం: ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతిలో వంద శాతం ఫలితాలు సాధించేందుకు టీచర్లు, విద్యార్థులు కృషి సాగుతోంది. విద్యార్థులలో పరీక్షల భయాన్ని పోగొడుతూ పరీక్షలలో ఎలాంటి ప్రశ్నలు వచ్చినా రాసేలా వారికి తగిన తర్ఫీదు ఇస్తున్నారు. శేరిలింగంపల్లి మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయుల పర్యవేక్షణలో ఉపాధ్యాయులు తగిన చర్యలు తీసుకుంటూ మెరుగైన ఫలితాల సాధనకు శ్రమిస్తున్నారు. ప్రభుత్వపాఠశాలల్లో వంద శాతం ఫలితాల సాధనపై స్వయంగా జిల్లా,మండల విద్యాధికారి పర్యవేక్షణ సాగిస్తున్నారు. ఎప్పటికప్పుడు ప్రధానోపాధ్యాయులతో డీఈఓ సమీక్షిస్తున్నారు. ఇప్పటికే విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, కమిషనర్, డీఈఓ ఆన్‌లైన్‌లో విద్యార్థులతో మాట్లాడి వారిలో ధైర్యాన్ని నింపారు.

శేరిలింగంపల్లిలోని జెడ్పీహెచ్‌ఎస్‌లు...

శేరిలింగంపల్లిలో లింగంపల్లి, శేరిలింగంపల్లి, మియాపూర్, కొత్తగూడ, కొండాపూర్,గచ్చిబౌలి, మాదాపూర్, రాయదుర్గం, ఖాజాగూడ, రాయదుర్గం ఉర్దూ మీడియం పనిచేస్తున్నాయి.

ఫలితాల సాధనకై తీసుకున్న చర్యలు ఇవే...

డిసెంబర్ చివరి నాటికే సిలబస్ పూర్తి చేసి ఉదయం 8 నుంచి 9 గంటల, సాయంత్రం 4 నుంచి 5.30 గంటల వరకు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారు.

- ప్రభుత్వ ఆదేశంపై సాయంత్రం ఉత్తప్పం, ఇడ్లీ, బోండా, దోశ, వేడివేడిగా వేయించిన పల్లీలు, బిస్కట్లు, పిల్లల ఇష్టానికి అనుగుణంగా అందిస్తున్నారు. కొన్ని చోట్ల సెయింట్ సంస్థ కూడా అందిస్తోంది
- రోజూ స్లిప్ టెస్టులు, సిలబస్ రివిజన్ చేస్తూ ప్రశ్నలకు జవాబులు ఎలా రాయాలి, బిట్స్ రాయడంపై ప్రత్యేక అవగాహన కల్పిస్తున్నారు.
- స్టడీ మెటీరియల్ కూడా చదివేలా చేస్తున్నారు. రోజూ ఒక సబ్జెక్టుపై ప్రత్యేక తరగతిలో సంబంధిత ఉపాధ్యాయుడు విద్యార్థుల సందేహాలను తీరుస్తూ వారిలో పూర్తి స్థాయి స్థైర్యాన్ని నింపుతున్నారు.
- సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్‌చే కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పిస్తున్నారు.
- సిలబస్‌లో సందేహాలను తీరస్తూ స్టడీ మెటీరియల్ చదివిస్తూ, ముఖ్యమైన ప్రశ్నలకు జవాబులు రాయడం, బిట్స్‌పై పూర్తి స్థాయి పట్టు సాధించేలా చేస్తున్నారు.
- ప్రాక్టీస్ టెస్టులు ఇప్పటికే రెండింటిని పూర్తి చేశారు. గురువారం ప్రీఫైనల్ ఎగ్జామ్స్ ప్రారంభించారు

ఆశించిన ఫలితాలు సాధిస్తాం



పదవ తరగతిలో వంద శాతం ఫలితాలు సాధించిన జెడ్పీహెచ్‌ఎస్‌ల జాబితా రాయదుర్గం చేర్చాలని సమష్టిగా కృషి చేస్తున్నాం. విద్యార్థులకు అన్ని సబ్జెక్టులపై సందేహాలు తీరుస్తూ స్లిప్‌టెస్టులు, ప్రాక్టీస్ టెస్టులు, ప్రీఫైనల్ వంటి పరీక్షలు నిర్వహిస్తూ వార్షిక పరీక్షలకు సిద్ధం చేస్తున్నాం. పరీక్షలంటే పూర్తి భయం పోగొట్టాం. ఉన్నతాధికారులు కూడా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ పలు సూచనలు, ఆదేశాలు జారీ చేయడంతో మరింత పటిష్టంగా నిర్వహిస్తున్నాం. ఆశించిన ఫలితాలే సాధిస్తాం.

– ఎస్.కె.తాజ్‌బాబు, హెచ్‌ఎం, జెడ్పీహెచ్‌ఎస్ రాయదుర్గం

నూరు శాతం ఫలితాల సాధనకు కృషి



శేరిలింగంపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పదవ తరగతి విద్యార్థులు నూరు శాతం ఫలితాల సాధనకు కృషి చేస్తున్నాం. అందు కోసం ప్రత్యేకంగా ఉదయం, సాయంత్రం వేళల్లో తరగతులు నిర్వహించడంతో పాటు ప్రాక్టీస్ టెస్టులు, సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్‌చే కెరీర్ గైడెన్స్‌ను అందిస్తున్నాం. ఉదయం, సాయంత్రం వేళల్లో విద్యార్థులకు స్నాక్స్ కూడా అందజేస్తున్నాం.

– పి.బల్వంత్‌రెడ్డి, ఇన్‌చార్జి హెచ్‌ఎం, శేరిలింగంపల్లి హైస్కూల్

ప్రత్యేక తరగతులు



పదవ తరగతిలో మెరుగైన ఫలితాలు సాధించేందుకు ప్రభుత్వం అందించిన షెడ్యూల్ ప్రకారం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. ఇప్పటికే ప్రాక్టీస్ టెస్టులు పూర్తి చేశాం. విద్యార్థులు బోర్డు ఎగ్జామ్‌లో ఇబ్బంది పడకుండ ఓఎంఆర్ షీట్స్‌ను కూడా ప్రీఫైనల్ ఎగ్జామ్‌లో పూర్తి చేయిస్తూ ప్రాక్టీస్ అయ్యేలా కృషి చేస్తున్నాం. నూటికి నూరు శాతం ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులంతా సమష్టి కృషి చేస్తున్నాం.

– జి.శైలజ, హెచ్‌ఎం, లింగంపల్లి హైస్కూల్

స్త్రీ మూర్తి సేవలు వెలకట్టలేనివి


‘ఎస్కీ’లో మహిళా దినోత్సవంలో పాల్గొన్న డైరెక్టర్ రామేశ్వరరావు, అధికారులు, ఉద్యోగులు

‘ఎస్కీ’ డైరెక్టర్ డాక్టర్ రామేశ్వర్‌రావు

రాయదుర్గం: స్త్రీ మూర్తి సేవలు వెలకట్టలేనివని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ జి.రామేశ్వరరావు పేర్కొన్నారు. శుక్రవారం గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళా వేడుకలలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ‘మానవజాతికి ప్రాణం పోసింది మగువేనన్నారు. త్యాగం అనురాగంలో తరగగని పెన్నిధి మగువ’ అంటూ స్త్రీ మూర్తి గొప్పతనాన్ని ఓ మహాకవి చాటాడని గుర్తు చేశారు. ‘ఎస్కీ’ ప్రాంగణంలో పాలసీ బజార్ సౌజన్యంతో బంజారాహిల్స్‌లోని ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీ ఆస్పత్రి సహకారంతో ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో ఉచిత వైద్య శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. ఎస్కీలో పనిచేసే మహిళా ఉద్యోగులు, అధికారులు, చదివే విద్యార్థులు వివిధ రకాల వైద్య పరీక్షలను చేయించుకున్నారు. ఈ వైద్య పరీక్షలను డాక్టర్ సుష్మతో పాటు మౌనిక, పూజ, మేనేజర్ గోపి, రవి, సునీల్‌కుమార్, పాలసీబజార్ నుంచి తేజశ్వర్‌శాస్త్రి, ఆదర్శ్ పాల్గొన్నారు. అనంతరం మహిళలకు ఆటల పోటీలను ముఖ్యంగా మ్యూజికల్ చైర్స్, షటిల్స్ పోటీలను నిర్వహించారు. పర్యావరణ విభాగం హెడ్ అనితా అగర్వాల్, కాలేజ్ చీఫ్ లక్ష్మీకాంతరావు, శ్రీధర్‌బాబు, డాక్టర చంద్రకళ, డాక్టర్ ఎం సింధు, డాక్టర్ పి రాజారావు, వై పద్మావతి, శ్వేత, సునీత, సౌమ్య, జ్యోతి, సరస్వతి, కవిత, రాజేశ్వరి పాల్గొన్నారు.

అతివలపై అఘాయిత్యాలు ఆగినప్పుడే...

నిజమైన సాధికారత

మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద

మాదాపూర్: మాదాపూర్‌లోని హెచ్‌ఐసీసీలో శుక్రవారం హైబీజ్ టీవీ ఆధ్వర్యంలో ఉమెన్స్ లీడర్‌షిప్ అవార్డుల ప్రదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమాన్ని మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... అతివలపై అఘాయిత్యాలు ఆగినప్పుడే వారు నిజమైన సాధికారత సాధించినట్టవుతుందన్నారు. అతివలకందరికీ మహిళా కమిషన్ అండగా ఉంటుందని తెలిపారు. సరస్వతి బాయి రాఠీని లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ పురస్కారంతో సత్కరించారు. వివిధ రంగాలలో అత్తమ ప్రతిభ కనబరిచిన మహిళకు 70 మందికి పైగా ఉమెన్స్ లీడర్‌షిప్ అవార్డులను అందజేశారు. టీజీ ఆయిల్‌ఫెడ్ మేనేజింగ్ డైరెక్టర్ షేక్ యాస్మీన్ బాషా, ఇండియా క్రౌన్ విన్నర్ డాక్టర్ ప్రీతి అడుసుమిల్లి, మా రీసర్చ్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ సునితా జి కుమార్, మల్లారెడ్డి విశ్వవిద్యాలయం హైదరాబాద్ చైర్‌పర్సన్ డాక్టర్ సి.హెచ్. ప్రీతిరెడ్డి, హైబీజ్ టీవీ మేనేజింగ్ డైరెక్టర్ ఎం.రాజగోపాల్, హైబీజ్ టీవీ ఎల్ఎల్‌పీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జె.సంధ్యారాణి పాల్గొన్నారు.



మహిళలకు పురస్కారాలు అందజేసిన మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద

మాస్టర్ డిజైనర్‌గా ఎఫ్‌డీడీఐ ఫ్యాకల్టీ డాక్టర్ రాంబాబు

రాయదుర్గం: ఫుట్‌వేర్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ హైదరాబాద్ ఫ్యాకల్టీ డాక్టర్ ముప్పిడి రాంబాబును మాస్టర్ డిజైనర్‌గా యూసుఫ్‌గూడలోని రహమత్‌నగర్‌లోని సీఆర్‌ఎస్ స్కిల్‌వర్సిటీ నియమించింది. ఆయనను ఈ నెల 10వ తేదీ నుంచి 24వ తేదీ వరకు నిర్మల్ పట్టణంలో జ్యూట్ బ్యాగుల తయారీపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమంలో మాస్టర్ డిజైనర్‌గా మహిళలకు శిక్షణ ఇచ్చే అవకాశం కల్పించారు. శిక్షణ పొందేవారికి జ్యూట్ బ్యాగుల తయారీ చేయడం, మార్కెటింగ్ చేఉసుకోవడం, సాంకేతిక సలహాలు ఇవ్వాలని నిర్వాహకులు సూచించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాంబాబు మాట్లాడుతూ... జ్యూట్ బ్యాగుల తయారీలో ఇప్పటికే చాలా మందికి శిక్షణ ఇవ్వడం జరిగిందని గుర్తు చేశారు. తాజాగా నిర్మల్‌లో కూడా ఇలాంటి అవకాశం వచ్చిందని ఆయన తెలిపారు. మహిళలు తమకాళ్లపై తాము నిలబడేలా చేయడానికి అవసరమైన శిక్షణ కార్యక్రమాలను నిర్వహించేందుకు ఎప్పుడూ సిద్ధంగా ఉంటామని స్పష్టం చేశారు.

చోరీలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్ట్

రూ. 2 లక్షల విలువైన సామగ్రి స్వాధీనం

మియాపూర్: నిర్మాణంలో ఉన్న భవనంలోని సామగ్రి చోరీకి పాల్పడిన వ్యక్తిని మియాపూర్ పోలీసులు అరెస్టు చేశారు. డీఐ రమేష్ నాయుడు సమాచారం మేరకు... శ్రీకాకుళంకు చెందిన రాజేష్ కుమార్(30) మియాపూర్‌లో నివాసం ఉంటున్నాడు. సులభంగా డబ్బు సంపాదించేందుకు నిర్మాణంలో ఉన్న భవనాల వద్ద సామగ్రిని దొంగతనం చేస్తూ జల్సాలకు పాల్పడుతుండేవాడు. ఈ క్రమంలో మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మంజీరారోడ్డులో నిర్మాణంలో ఉన్న ఆదిత్య ఫార్చ్యూన్ అపార్ట్‌మెంట్‌లో వాటర్ డైవర్షన్ ట్యాప్‌లను దొంగతనం చేశాడు. ఒక్కో ట్యాప్ సుమారు రూ. 3,500 ఉంటుంది. ట్యాప్‌లు లేవని గ్రహించిన సైట్ ఇంచార్జీ మురళీ ఈ నెల 4వ తేదీన మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దర్యాప్తులో భాగంగా రాజేష్ కుమార్‌ను అదుపులోకి తీసుకు విచారించగా ఆ ట్యాప్‌ల సామగ్రిని దొంగిలించినట్లు అంగీకరించాడు. అతని నుంచి సుమారు రూ. 2 లక్షల విలువచేసే ట్యాప్‌లను స్వాధీనం చేసుకున్నారు. రాజేష్ కుమార్‌ను అరెస్ట్ చేసి రిమాండుకు తరలించామని డీఐ రమేష్ నాయుడు వివరించారు.

మహిళలు, ఉపాధ్యాయినులకు సన్మానం

చందానగర్: మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని చందానగర్‌లోని జిల్లా పరిషత్ పాఠశాలలో శుక్రవారం హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలు, ఉపాధ్యాయినులకు ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా శేరిలింగంపల్లి మండల విద్యాధికారి వెంకటయ్య, హోప్ ఫౌండేషన్ అధ్యక్షుడు కొండ విజయ్‌కుమార్, ప్రధానోపాధ్యాయులు వసుంధర, పీఆర్‌టీయూ అధ్యక్షుడు హనుమంతు, ప్రధాన కార్యదర్శి రవీందర్‌రెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలన్నారు. జోయ్ అలుక్కాస్ మహిళా మేనేజర్ శ్రావణి, ఉష, భీమమ్మ, సుభాష్, యూసుఫ్, సునీత, సరళ, విజయలక్ష్మి, ప్రీతీ, కృష్ణ వేణి, పద్మలత, స్వప్న, ఘౌస్సీ, కవిత, నరేష్‌కుమార్, రాజ్ కుమార్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కొండాపూర్‌లో సూత్ర వస్త్ర ప్రదర్శన



లక్డీకాపూల్: వేసవికి అనువైన తాజా దుస్తుల కోసం ఎదురు చూసే నగరవాసులను సూత్ర వస్త్ర ప్రదర్శన అలరిస్తుంది. సరికొత్త డిజైనర్ వేర్, మిరుమిట్లు గొలిపే ఆభరణాలతో పాటుగా చిక్ యాక్సెసరీలను సూత్ర ఒకే ప్లాంట్‌పైకి తీసుకువచ్చింది. కొండాపూర్‌లోని మాయ లగ్జరీ కన్వెన్షన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన సూత్రా వస్త్ర ప్రదర్శన మునుపెన్నడూ పొందని ఫ్యాషన్ వస్త్ర ప్రపంచ అనుభూతినిస్తుంది. ఉగాది, రంజాన్ పండుగల కోసం అందమైన సంప్రదాయ దుస్తుల షాపింగ్ చేయాలనే ఆలోచన ఉంటే ఒక్కసారి ఈ ప్రదర్శనను సందర్శించాల్సిందిన నిర్వాహకులు పేర్కొన్నారు. ప్రకృతి సిద్ధమైన అసలైన రుచులు, ప్రత్యేకమైన ఫ్యాషన్ వస్త్రాలు, నగలకు ఒకే గమ్యస్థానం సూత్ర అన్నారు.

విద్యుదాఘాతంతో విద్యార్థినికి తీవ్ర గాయాలు

- రెయిన్‌బో స్కూల్ వద్ద విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళన
- పరామర్శించిన ఎమ్మెల్యే, కార్పొరేటర్


విద్యార్థిని తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాంధీ

చందానగర్: కరెంట్ షాక్‌తో విద్యార్థికి తీవ్ర గాయాలైన సంఘటన చందానగర్‌లో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలివీ... చందానగర్‌లోని రెయిన్‌బో స్కూల్‌లో 6వ తరగతి చదువుతున్న గౌరీ స్నేహితురాలితో కలిసి ఆడుతుండగా షటిల్ కాక్ విద్యుత్ తీగలపై పడింది. దీంతో ఇనుపరాడు సాయంతో కాక్ తీసేందుకు ప్రయతిస్తుండగా విద్యుత్ షాక్‌కు గురైంది. స్థానికులు గమనించి వెంటనే విద్యార్థినిని ఆస్పత్రికి తరలించారు. అయితే గౌరీ తల్లిదండ్రులు తమ చిన్నారి స్కూల్‌లో ఉందని, ఎలాంటి సమాచారం ఇవ్వకుండా స్కూల్ నుంచి బయటకు ఎలా పంపిస్తారని స్కూల్ యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వారం క్రితం జరిగిన ఘటన పై స్కూల్ యాజమాన్యం పట్టించుకోవడం లేదని ఆవేదన చెందుతున్నారు. చిన్నారి ఆరోగ్యం విషమంగా ఉందని వారం నుంచి ఐసీయూలో చికిత్స పొందుతోందన్నారు.

బాధితులకు ఎమ్మెల్యే పరామర్శ..

బాలిక గౌరీకి కరెంట్ షాక్‌కు గురైన విషయం తెలుసుకున్న పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ, చందానగర్ సీనియర్ నాయకులు రఘునాథ్‌రెడ్డిలు శుక్రవారం సాయంత్రం రెయిన్‌బో స్కూల్ వద్ద ఆందోళన చేస్తున్న బాలిక తల్లిదండ్రులతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... బాలికకు మెరుగైన వైద్యం కోసం కృషి చేస్తానని, పాఠశాల యాజమాన్యంతో మాట్లాడి సరైన న్యాయం చేస్తామన్నారు. తన వంతు సహాయ సహకారాలు ఉంటాయన్నారు. నిర్లక్ష్య పూరితంగా వ్యవహరించిన పాఠశాల యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించామన్నారు.

క్షయవ్యాధిపై అవగాహన తప్పనిసరి

పటాన్‌చెరు టౌన్: క్షయవ్యాధిపై తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని ఈఎస్‌ఐ ఆస్పత్రి సూపరింటెండెంట్ సత్యనారాయణ అన్నారు. శుక్రవారం రామచంద్రపురం ఈఎస్‌ఐ ఆస్పత్రిలో టీబీ క్యాంపెయిన్‌లో భాగంగా క్షయపై అవగాహన కల్పించారు. క్షయవ్యాధి మందులు వాడుతున్న వారికి రోగనిరోధక శక్తి పెంచేందుకు న్యూట్రిషన్ సంబంధించిన పదార్థాలను అందజేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ.. క్షయవ్యాధి వచ్చిన వారు భయపడవద్దని దానికి సరైన మందులు వాడితే తగ్గిపోతుందన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ దేవేందర్ రాజ్, భవ్య, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

పీజేఆర్ నగర్‌లో ఉచిత వైద్య శిబిరం

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పీజేఆర్ నగర్ కాలనీలో పీజేఆర్ నగర్ యువశక్తి మహిళా మండలి, హెల్పింగ్ హార్ట్స్ సొసైటీ ఆధ్వర్యంలో మల్లారెడ్డి హాస్పిటల్స్ సహకారంతో శుక్రవారం మెగా వైద్య శిబిరం నిర్వహించారు.